క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

ఒంగోలు సిటీ: ఒంగోలు డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు డి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిపో మేనేజర్ సెల్ నంబర్ 9959225695కు ఫోన్ చేసి తమ రూట్లలో ఉన్న సమస్యలు తెలియజేసి పరిష్కారానికి సలహాలు ఇవ్వాలని కోరారు.

గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుజన్ కుమార్ తెలిపారు. అవన్నీ గ్రామ కంఠంలో పొజిషన్ సర్టిఫికెట్ల కోసం వచ్చినట్లు చెప్పారు.

ఉపకులపతిని కలిసిన ఇగ్నో ప్రొఫెసర్



ప్రొఫెసర్ రవిశంకర్‌ను సన్మానిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టరు కె.రవిశంకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రొఫెసర్ రవిశంకర్ తొలిసారిగా ఆంధ్రకేసరి యూనివర్సిటీని సందర్శించారు. వారిద్దరూ పలు అంశాలపై చర్చించారు. ప్రొఫెసర్ రవిశంకర్‌ను శాలువాతో వీసీ మూర్తి సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి ఉన్నారు.

గుంతను పూడ్చిన మున్సిపల్ సిబ్బంది



సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక జేఎంబీ చర్చి వద్ద మెయిన్ రోడ్డు మార్జిన్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంతను మున్సిపల్ సిబ్బంది సోమవారం పూడ్చివేశారు. మంచినీటి పైపులైన్‌కు మరమ్మతుల నిమిత్తం తీసిన గుంతను పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా ఉంది. దానిపై సాక్షి దినపత్రికలో ×రోడ్డుపై ప్రమాదకరంగా గుంత¥ అనే శీర్షికతో సోమవారం వార్త ప్రచురితమైంది. అందుకు స్పందించిన మున్సిపల్ అధికారులు సోమవారం ఉదయమే సిబ్బందితో గుంతను పూడ్చించారు. స్థానికులు, వాహనదారులు సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పీసీపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్సై జి.కోటయ్య అన్నారు. స్థానిక గోపాలువారిపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థులతో ఎస్సై సోమవారం సమావేశమయ్యారు. అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు, సౌకర్యాలను వివరించారు.

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది

- కార్యక్రమాల్లో పాల్గొనని అన్ని శాఖల వ్యవసాయాధికారులు
- పరిష్కారం కాని రైతుల సమస్యలు
- అందని సలహాలు, సూచనలు
- ఫొటోలు దిగి సరిపెట్టుకుంటున్న వ్యవసాయ అధికారులు, సిబ్బంది



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఫొటోకి ఫోజులిస్తున్న వ్యవసాయ అధికారులు

ఒంగోలు సిటీ: రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలు ఒంగోలు నియోజకవర్గంలో మొక్కుబడిగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో నూతన సాగు పద్ధతులు, నూతన వంగడాల పరిచయం, వ్యవసాయంలో నూతన శాస్త్ర సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. పండిన పంటకు మార్కెటింగ్, గిట్టుబాటు ధర, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, ప్రకృతి వ్యవసాయం దిశగా అన్నదాతలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆయా కార్యక్రమాలలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. రైతుల సమస్యలు పరిష్కరించి నాణ్యమైన పంటలు పండించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. కానీ, పొలం పిలుస్తోంది కార్యక్రమాలలో ఇవన్నీ జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

పది శాఖలకుగానూ ఒకటీరెండు శాఖల అధికారులే హాజరు...

ఒంగోలు నియోజకవర్గంలోని ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో వ్యవసాయ అధికారులు మాత్రమే పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 23 రెవెన్యూ గ్రామాల్లో సెప్టెంబర్ 24న ప్రారంభమైన కార్యక్రమాలు 2025 జనవరి 2వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంది. వారంలో రెండు రోజుల పాటు.. మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి వారం నాలుగు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయశాఖతో పాటు ఆత్మ, సెరీకల్చర్, ఉద్యానవనశాఖ, పశుసంవర్థకశాఖ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, కో ఆపరేటివ్ ఫెడరేషన్, మత్స్యశాఖ, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం, ఇలా సుమారు 10 శాఖల అధికారులు విధిగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు హాజరుకావాల్సి ఉండగా, ఒకటీరెండు శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. కేవలం వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది హాజరై మమ అనిపిస్తున్నారు. ఉద్యానవన, ఇతర శాఖలకు సంబంధించిన వారు హాజరుకాకపోతుండటంతో ఆయా శాఖల పరిధిలోని రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదు.

పంట పొలాల్లో ఫొటోలు దిగి వచ్చేస్తున్న వైనం...

ఖరీఫ్‌లో వేసిన రెగ్యులర్ పంటలతో పాటు వేరుశనగ, వరి, శనగ, మినుము, పచ్చిమిర్చి, చామదుంప, ఆకుకూరలు వంటి పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం రబీ సీజను కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను పక్కాగా నిర్వహిస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. కానీ, వ్యవసాయ అధికారులే పాల్గొని ఎంపిక చేసిన రైతుల పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి వచ్చేస్తున్నారు. రైతులతో నామమాత్రంగా మాట్లాడి కార్యక్రమం పూర్తయినట్లు చెప్పి వెళ్లిపోతున్నారు. రైతులకు సాగు వ్యయం తగ్గింపు, నాణ్యమైన పంట దిగుబడులు, తెగుళ్ల నివారణ, పంట సాగులో మెళకువలు, సాంకేతిక పరిజ్ఞానం, గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ స్కిల్స్ తదితర విషయాలలో ఏ ఒక్కదానిపైనా అధికారులు అవగాహన కల్పిస్తున్న దాఖలాలే లేవు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రైతుల పరిస్థితి ఉంటోంది. ఉన్నతాధికారులు స్పందించి పొలం పిలుస్తోంది కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలతో తమకు ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేసి అనుమానాలు నివృత్తి చేయాలని, తమ అభ్యున్నతికి అవసరమైన చర్యలను వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చీమకుర్తి విద్యార్థులకు కరాటేలో బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో చీమకుర్తికి చెందిన పలువురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. సోమవారం చీమకుర్తిలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సీఐ ఎం.సుబ్బారావు వారిని అభినందించారు. కరాటే మాస్టర్ డీఎస్‌వీ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం చిలకలూరిపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలలో చీమకుర్తిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. వారిలో ఎల్లోబెల్ట్, ఆరెంజ్, గ్రీన్, వైట్ బెల్ట్‌లలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులలో రేణుశ్రీ, సాయిసునంద, ప్రహ్లాదిక, లక్ష్మీ, తేజస్, వెంకటసాయి, గురువిష్ణు, కౌస్తు ఉన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ సుధాకర్‌ను సీఐ అభినందించి మాట్లాడారు. కరాటే వలన విద్యార్థులలో చిన్నతనం నుంచే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఆరోగ్యవంతంగా ఉంటారని, ఆత్మరక్షణకు తోడ్పడుతుందని ప్రోత్సహించారు.

నడిరోడ్లపై ప్రైవేటు కార్యక్రమాలు



గోరంట్ల కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డుపై ఏర్పాటు చేసిన డయాస్



గోపీకృష్ణ సినిమా హాళ్లకు వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్

- భారీ వేదికలు ఏర్పాటు చేసి రోడ్లను బ్లాక్ చేస్తున్న నిర్వాహకులు
- అడ్డగోలుగా అనుమతులిస్తున్న పోలీస్, మున్సిపల్ అధికారులు
- కొన్నిచోట్ల అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నప్పటికీ పట్టించుకోని అధికారులు
- వాహనాల రాకపోకలు నిలిచిపోయి అవస్థపడుతున్న ప్రజలు

ఒంగోలు సబర్బన్: నగరంలో నడిరోడ్లపై ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భారీ వేదికలు సైతం ఏర్పాటు చేసి ఆయా రోడ్లకు రెండువైపులా అడ్డంగా తాళ్లు కట్టి ఏకంగా వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నారు. వీటిలో కొన్నింటికి పోలీస్, మున్సిపల్ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇస్తుండగా, మరికొన్నింటికి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ.. అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శుభకార్యాలు, అశుభకార్యాలకు సంబంధించిన భోజన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు వంటి వాటితో నగరంలో తరచూ రోడ్లను బ్లాక్ చేస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తాజాగా మాలధారులు భజనలను సైతం రోడ్లపైనే ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ ఒంగోలు నగర ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదారులను సైతం బ్లాక్ చేసి మరీ ప్రజలను నానా అవస్థలకు గురిచేస్తున్నారు. అందుకు అధికార పార్టీ నాయకులు తానా అంటే.. ఒంగోలు నగర పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు తందానా అంటున్నారు. నగరంలోని పాత మార్కెట్ వద్ద నుంచి గోరంట్ల కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డును సోమవారం రాత్రి బ్లాక్ చేసి మెయిన్ రోడ్డుపైనే అడ్డంగా డయాస్ ఏర్పాటు చేయడమే అందుకు నిదర్శనంగా ఉంది. రెండువైపులా ఎవరూ నడవడానికి కూడా వీలు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

రద్దీగా ఉండే రోడ్డునూ వదలని వైనం...

నగరంలోని పాత మార్కెట్ వద్ద నుంచి గోరంట్ల కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డు నిత్యం ఎంతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై సెయింట్ థామస్ హైస్కూలు ముందు రోడ్డుకు అడ్డంగా డయాస్ ఏర్పాటు చేసి రోడ్డును బ్లాక్ చేయడంతో వాహనదారులు, పాదచారులు సైతం నానా అవస్థలు పడ్డారు. ఆ రోడ్డులో నుంచే గోపాల్‌నగర్, గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్, కమ్మపాలెం, ఇస్లాంపేట, పోతురాజు కాలువ పరిసర ప్రాంతాల్లో నివసించేవారు ప్రయాణించాల్సి ఉంది. ఆయా ఏరియాలతో పాటు బలరాం కాలనీ, బాలినేని భరత్ కాలనీ, గడ్డికయ్యలు ఏరియా, ఉప్పు చెరువు, కేశవరాజుకుంట ప్రాంతాలకు కూడా అదే రోడ్డు నుంచి ప్రయాణించాల్సి ఉంది. ఉత్తర బైపాస్‌కు, కిమ్స్ హాస్పిటల్, ముక్తినూతలపాడు, కలవరీ టెంపుల్, త్రోవగుంటకు కూడా ఈ రోడ్డు షార్ట్‌కట్‌గా ఉంది. అలాంటి రోడ్డును బ్లాక్ చేసినా పట్టించుకోని అధికారులు, పోలీసుల తీరుపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగోలుగా ట్రాఫిక్ పోలీసుల అనుమతి...

ఎంతో రద్దీగా ఉండే గోరంట్ల కాంప్లెక్స్ రోడ్డుపై ప్రైవేటు కార్యక్రమం నిర్వహణకు ఒంగోలు నగర ట్రాఫిక్ పోలీసులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడంపై నగర ప్రజలు రగిలిపోతున్నారు. వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు ఈ రోడ్డుమీదుగా ప్రయాణించాల్సి ఉంటే.. నగర ట్రాఫిక్ పోలీసులు ఏ విధంగా ఆ రోడ్డును బ్లాక్ చేయిస్తారని మండిపడుతున్నారు. రోడ్డును బ్లాక్ చేయటంతో సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు అటుగా వెళ్లాల్సిన వారు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాపూజీ కాంప్లెక్‌లో నుంచి గోరంట్ల కాంప్లెక్స్ వైపు వెళ్లే గేటు కూడా మూసివేయడంతో వాహనదారులు, ప్రజల ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.

గత్యంతరం లేక పాత గుంటూరు రోడ్డులో నుంచి సందులు, గొందుల్లో ప్రయాణించి అష్టకష్టాలు పడి గమ్యస్థానాలకు చేరారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, నగరంలోని రోడ్లపై ప్రైవేటు కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికవగా, వారికి అదే పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు చెక్కా కోటేశ్వరరావు తన సొంత నిధులతో సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం మన్నం శ్రీదేవి చేతుల మీదుగా వాటిని అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయిలో పాల్గొని పతకాలు గెలవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆటల పోటీల్లో ఎన్నో పతకాలు సాధించిన సంఘటనలు ఉన్నాయన్నారు. చెక్కా కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి పాఠశాలలోని ఉపాధ్యాయులంతా సహకరిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారికి నగదు బహుమతి కూడా ప్రకటించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ, పాఠశాల కమిటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, పాఠశాలలో పనిచేస్తున్న క్రీడా ఉపాధ్యాయులు సాయి కిషోర్, ఫయాజ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. కోటేశ్వరరావు మాస్టర్ దాతృత్వాన్ని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

బధిరుల మధ్య వైఎస్ భారతి జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న పాటిబండ్ల గంగయ్య, రాజసులోచన

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి జన్మదిన వేడుకలను సోమవారం చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ భారతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, వైఎస్ భారతి సేవాసమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజసులోచన, మాజీ కౌన్సిలర్ పాటిబండ్ల శారద పాల్గొని కేకు కట్ చేశారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



వేణుగోపాల్, తదితరులను సన్మానిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

సంతనూతలపాడు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 7వ తేదీ ప్రారంభమైన సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ రాష్ట్రస్థాయి సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు సోమవారం మూడోరోజు ఆసక్తికరంగా సాగాయి. జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, హైదరాబాద్ డీఎస్పీ అన్ను వేణుగోపాల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా, ఆర్గనైజర్లు సూదనగుంట వేణుబాబు, మందాడి వెంకటేశ్వర్లు, ముప్పరాజు శ్రీనివాసరావు, పావులూరి నారాయణస్వామిచౌదరి, బొడ్డు శంకర్‌బాబు, చిట్టంశెట్టి శ్రీనివాసరావు, సాదినేని శ్రీరామమూర్తి తదితరులు పర్యవేక్షించారు. నేటితో పోటీలు ముగియనుండగా, సోమవారం జరిగిన పురుషుల మ్యాచ్‌లలో కృష్ణా జిల్లా జట్టు సెమీఫైనల్స్‌కు చేరుకుంది. వెస్ట్ గోదావరి-గుంటూరు, ఈస్ట్ గోదావరి-శ్రీకాకుళం, ప్రకాశం-నెల్లూరు జిల్లాల జట్లు మ్యాచ్‌లలో తలపడ్డాయి. మహిళా విభాగంలో విజయనగరం-వైజాగ్, కర్నూలు-శ్రీకాకుళం జట్లు, కృష్ణ-గుంటూరు జట్లు, వెస్ట్ గోదావరి-చిత్తూరు జట్లు తలపడ్డాయి. వేణుగోపాల్, తదితరులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు.

సోలార్ ఎనర్జీని వినియోగించుకోండి



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

చీమకుర్తి రూరల్: సోలార్ రూఫ్ టాప్ ఎనర్జీని గ్రామీణ స్థాయిలో సైతం వినియోగించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని విద్యుత్ శాఖ దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని ఆర్‌ఎల్ పురం సచివాలయం పరిధిలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం సోలార్ విద్యుత్, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాసులు పాల్గొని సోలార్ విద్యుత్ విశిష్టత, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రయోజనాల గురించి వివరించారు. వినియోగదారులకు సోలార్ ఎనర్జీ ఏర్పాటు, వినియోగం, నూతన కనెక్షన్ల రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్‌ను గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు సైతం చేరువచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1, 2, 3 కిలోవాట్లకు అవసరమైన సోలార్ ఎనర్జీ ప్లేట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కనెక్షన్ పొందేందుకు సబ్సిడీతో పాటు బ్యాంక్ రుణాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో డీఈఈ ఆర్.మోహనరావు, వి.శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, గ్రామ సర్పంచ్ పుల్లగూర రమణమ్మ, ఎంపీటీసీ వంకాయలపాటి అహరోను, గ్రామ సెక్రటరీ, విద్యుత్ శాఖ సిబ్బంది, వినియోగదారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పశువుల మేత భూములను కాపాడండి

ఒంగోలు సిటీ: జిల్లాలోని పశువుల మేత భూములను రెవెన్యూ అధికారులు వెంటనే కాపాడాలని కోరుతూ ఒంగోలు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసుకు ద్రావిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలోని అనేక గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలు మేపుకునేందుకు ప్రభుత్వం కేటాయించిన భూములను ఇటీవల కొందరు భూ కబ్జాదారులు ఆక్రమించుకుని దొంగపట్టాలు పుట్టించి ఇప్పటికే కొంత భూమిని రిజిస్టర్ భూమిగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని తెలిపారు. పుల్లలచెరువు మండలంలో మానేపల్లి, అయ్యవారిపాలెం, సిద్దనపాలెం గ్రామాల్లో సర్వే నంబర్ 152, 152/2లో భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ప్రశ్నించిన రైతులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి దొంగ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆ భూములను చేతులు మార్చి రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఒంగోలు దగ్గరలోని టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో ఉన్న చెరువు, పశువులు మేసే భూములను కొందరు ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారుల అండదండలతో కబ్జా చేసి దొంగ పట్టాలతో రెవెన్యూ రికార్డులు కూడా మారుస్తున్నారని ఆరోపించారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ద్రావిడ దేశం అధ్యక్షుడు కృష్ణారావు

పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలి...

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరు తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరి తేటతెల్లం అవుతోందన్నారు.

హాస్టల్ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతి...

దర్శి ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ దర్శిలోని ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్లో మరుగుదొడ్ల సమస్య ఉందన్నారు. ఫ్యాన్లు కూడా లేక విద్యార్థులే ఫ్యాన్లు కొనుక్కుంటున్నారని తెలిపారు. ఇంకా ఫ్యాన్‌లు అవసరమని అన్నారు. ఒక వర్కర్ మాత్రమే ఉన్నారని, భోజనం రుచికరంగా లేక కడుపులు మాడ్చుకుంటున్నారని తెలిపారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని, ఫ్లోరైడ్ నీరు తాగుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతామని తెలిపారు.